క్లుప్తంగా

శ్రీసరస్వతీ శిశుమందిర్ ప్రబంధకారిణి బాధ్యతల స్వీకారం



తెనాలి: స్థానిక సుల్తానాబాద్‌లోని శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో పాఠశాల ప్రబంధకారిణి బాధ్యతల స్వీకరణ కార్యక్రమం ఆదివారం గౌరవ అధ్యక్షుడు కొత్త సుబ్రహ్మణ్యం సమక్షంలో నిర్వహించారు. సంచాలిత సమితి అధ్యక్షుడు డాక్టర్ సామల లక్ష్మణబాబు అధ్యక్షత వహించగా కాకతీయ కో–ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరిస్తున్న కమిటీ అధ్యక్షుడు అవ్వారు లత, కార్యదర్శి యర్రంశెట్టి హనుమంత రావు, కోశాధికారి కొత్త కిరణ్మయి, సభ్యులు గడ్డం శ్రీధర్, దేవతి భాస్కర్‌లను లక్ష్మణబాబు పరిచయం చేశారు. అనంతరం పాఠశాల స్థాపనకు ముఖ్య దాత, ప్రధాన కారకుడు కొత్త సుబ్రహ్మణ్యంను కమిటీ సభ్యులు, మాతాజీలు సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావుకు డాక్టరేట్



తెనాలిటౌన్: స్థానిక ఐతానగర్‌కు చెందిన చీకటి వెంకటేశ్వరరావు హార్ట్ డీసీస్ డిటెక్షన్, ప్రిడిక్షన్ విత్ మెషీన్ లెర్నింగ్ అనే అంశం మీద పరిశోధన చేసినందుకు గాను తమిళనాడు గవర్నమెంట్ అన్నామలై యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసింది. డాక్టర్ వెంకటేశ్వరరావు ప్రస్తుతం కెఎల్ యూనివర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. వెంకటేశ్వరరావుకు డాక్టరేట్ రావడంపై స్నేహితులు డాక్టర్ కృష్ణమోహన్, కొండ్రు కిరణ్‌కుమార్, జి.రవికుమార్, కిషోర్, సోమశేఖర్, శ్రీకాంత్ తదితరులు అభినందనలు తెలిపారు.

మోహనరావు కుటుంబానికి ఆర్థికసాయం

తెనాలిటౌన్: ఇటీవల మృతి చెందిన కళాకారుడు, సీపీఐ నాయకుడు గాలిముట్టి మోహనరావు సేవలు చిరస్మరణీయమని కళల కాణాచి సంస్థ కోశాధికారి దేవరపల్లి భవానీ పేర్కొన్నారు. ఆదివారం మోహనరావు సంస్మరణ కార్యక్రమాన్ని స్థానిక చంద్రబాబునాయుడు కాలనీలోని ఆయన నివాసం వద్ద నిర్వహించారు. కళల కాణాచి అధ్యక్షుడు బుర్రా సాయిమాధవ్ ఆదేశాల మేరకు సంస్థ కోశాధికారి దేవరపల్లి భవానీ మోహనరావు కుటుంబానికి రూ.5వేల నగదు ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో సమత జ్యోతి, సంగీత కళాసేవా సమితి, ఆర్అండ్‌బీ రాజు, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

తెనాలిరూరల్: విజయవాడ – తెనాలి రైలు మార్గంలో కొలకలూరు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని పురుష మృతదేహాన్ని రైల్వే పోలీసులు ఆదివారం కనుగొన్నారు. మృతుని వయస్సు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఆనవాళ్లు గుర్తించేందుకు వీలు లేకుండా మృతదేహం ఛిద్రమైందని, సమాచారం తెలిసినవారు తెనాలి జీఆర్పీ పోలీసులను సంప్రదించాల్సిందిగా ఎస్ఐ వెంకటాద్రి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు



తెనాలిటౌన్: స్థానిక ఇస్లాంపేటలోని యేసయ్య ప్రార్థన కొండ చర్చిలో ఆదివారం ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు నిర్వహించారు. దైవజనులు బ్రదర్ ఆనందన్న కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దైవ సేవకురాలు పి.రత్నకుమారి, బ్రదర్ కె.పాల్ రాజశేఖర్, ప్రశాంత్‌బాబు, సీమోను, పలువురు సంఘ పెద్దలు పాల్గొన్నారు.

వెన్నుపోటు పుస్తకం ఆవిష్కరణ నేడు

మంగళగిరి టౌన్: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తోందని.. కూటమి మోసాలపై వెన్నుపోటు అనే పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించనున్నట్లు మంగళగిరి నియోజకవర్గ సమన్వయ కర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆత్మకూరు బైపాస్‌లోని పార్టీ కార్యాలయంలో వెన్నుపోటు పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని.. కార్యక్రమానికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహనరావులు హాజరు కానున్నారని తెలిపారు. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

తెలుగు భాషతోనే కర్ణాటక సంగీతవ్యాప్తి

- పద్మశ్రీ అన్నవరపు రామస్వామి
- మోదుమూడికి గద్దె వెంకట రామకుమారి స్మారక సంగీత పురస్కారం ప్రదానం



మోదుమూడి సుధాకర్‌కు రామకుమారి స్మారక పురస్కారం ప్రదానం చేస్తున్న దృశ్యం

తెనాలి: విశాలమైన తెలుగు భాష కారణంగానే కర్ణాటక సంగీతం వ్యాప్తి చెందినదని ప్రముఖ సంగీత విద్వాంసుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత 'నాదసుధార్ణవ' అన్నవరపు రామస్వామి అన్నారు. పట్టణానికి చెందిన సంగీత సంస్థ హేమాద్రి మ్యూజికల్ అకాడమీ ఆధ్వర్యంలో 'గాన విదుషి' గద్దె వేంకట రామకుమారి దశమ వర్ధంతి సంగీత ఉత్సవాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఏర్పాటైన సభకు ములుకుట్ల బ్రహ్మానందశాస్త్రి అధ్యక్షత వహించారు. సభలో విజయవాడకు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్‌కు విశ్రాంత సీనియర్ సివిల్ జడ్జి ఎంవీఎస్ ప్రభాకర్ చేతుల మీదుగా గద్దె వెంకట రామకుమారి స్మారక సంగీత పురస్కారాన్ని బహూకరించారు. సంగీతానికి ఏవిధమైన భాష్యం లేదనీ, అందరి హృదయాలను తాకుతుందని, జీవకోటిని ఆనంద పరుస్తుందని ముఖ్యఅతిథి ఎంవీఎస్ ప్రభాకర్ అన్నారు.



శాస్త్రీయ సంగీత సభలో గానం చేస్తున్న మోదుమూడి సుధాకర్

గురువు పేరిట పురస్కారం మహద్భాగ్యం

సత్కార గ్రహీత మోదుమూడి సుధాకర్ తన ప్రసంగంలో తన గురువు రామకుమారి పేరిట పురస్కారాన్ని తీసుకోవటం ఆమె ఆశీస్సులుగానే భావిస్తానని చెప్పారు. తన గురువు కేవలం విద్యను మాత్రమే చెప్పలేదని, పుత్రప్రేమను పంచిందని చెప్పుకున్నారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించి, మహిళలకు సంగీతం నేర్చుకోవటం కష్టసాధ్యమైన నాటికాలంలో రామకుమారి సంగీతం నేర్చుకుని, సంగీత కళాశాల అధ్యాపకురాలిగా ఎందరినీ తీర్చిదిద్దారని చెప్పారు. చివరివరకు నిష్ఠతోనే విద్యను నేర్పారని అన్నారు. ఆకాశవాణి బాలల సంగీత విభావరిని తెనాలిలో నిర్వహించినపుడు 15 ఏళ్ల వయసులో తన తొలి కచేరీ ఇక్కడే జరిగిందని సుధాకర్ గుర్తు చేసుకున్నారు. ఏటా రామకుమారి వర్ధంతి రోజున సంగీత ఉత్సవాలను నిర్వహిస్తున్న అకాడమీని అభినందించారు. అకాడమీ అధ్యక్షుడు కోదండరామశాస్త్రి సంగీతం ప్రాధాన్యతను వివరించారు. ఉపాధ్యక్షుడు ఎం.సుబ్రహ్మణ్యశాస్త్రి అతిథులను సత్కరించారు. సభానంతరం శాస్త్రీయ సంగీత సభలో మోదుమూడి సుధాకర్ తన గానంతో సంగీతాభిమానులను పరవశింపజేశారు. వయోలిన్‌పై హేమాద్రి చంద్రకాంత్, మృదంగంపై కె.సుద్గురు చరణ్ వాయిద్య సహకారం అందించారు. సంస్థ కార్యదర్శి వీఎల్ సుజాత పర్యవేక్షించారు.

పోస్టల్ ప్రధాన కార్యాలయంలో నిలిచిన సేవలు



ప్రధాన పోస్టాఫీసు ఎదుట వేచివున్న ఖాతాదారులు



పోస్టాఫీసు లోపల ఖాతాదారుల ఎదురుచూపులు

- విద్యుత్ అంతరాయంతో 14వ తేదీ మధ్యాహ్నం వరకు లావాదేవీలు బంద్
- జనరేటరు కూడా రిపేరులోనే ..
- విస్మయానికి గురైన ఖాతాదారులు

తెనాలి: విద్యుత్ అంతరాయం కారణంగా పట్టణంలోని కొత్తపేటలో గల ప్రధాన పోస్టల్ కార్యాలయంలో సేవలు నిలిచిపోయాయి. రెండవ శనివారం జరిగిన సేవల అంతరాయాన్ని స్థానికులు ఆదివారం 'సాక్షి' దృష్టికి తీసుకొచ్చారు. వివరాల్లోకి వెళితే, విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ప్రతి శనివారం విద్యుత్ శాఖ కొన్ని ఏరియాల్లో సరఫరాను నిలిపివేస్తుంటుంది. ఆ సమాచారాన్ని ముందుగానే తెలియపరుస్తుంది. ఆ క్రమంలో శనివారం పట్టణం, రూరల్ గ్రామాలతో సహా మొత్తానికి ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. అన్నిచోట్ల ఉన్నట్టుగానే ప్రధాన పోస్టల్ కార్యాలయంలోనూ కరెంటు సరఫరా లేదు. అయితే జనరేటర్ సౌకర్యాన్ని వినియోగించుకుని కార్యకలాపాలు నిర్వహించాల్సి ఉండగా, అదీ జరగలేదు. పోస్టల్ కార్యాలయం పగటిపూట చీకట్లో ఉండిపోయింది. అదేమని అడిగితే జనరేటరు రిపేరులో ఉందని సమాధానం చెప్పారు. జనరేటరును బాగుచేయటానికి టెక్నీషియన్ గుంటూరు నుంచి రావాల్సి ఉందని, అప్పటివరకు చేసేది ఏమీలేదని సిబ్బంది సమాధానమిచ్చారట!

ఆధార్ సేవలకూ ఆటంకం..

పోస్టల్ కార్యాలయంలో డిపాజిట్లు, మెచ్యూరిటీ వంటి లావాదేవీలకు ప్రతినెల 15, 30 తేదీలు చివరి తేదీగా ఉంటాయి. 15వ తేదీ ఆదివారం కావటంతో రెండవ శనివారమైన 14వ తేదీనే సంబంధిత లావాదేవీలు జరగాల్సి ఉంది. అందుచేత పోస్టాఫీసుకు వెళ్లినవారికి అంధకారం దర్శనమిచ్చింది. కొత్త ట్రాన్సాక్షన్స్‌తో సహా పోస్టల్ లావాదేవీలన్నీ నిలిచిపోయాయి. ఆధార్ సేవలను కూడా ఇటీవలకాలంలో పోస్టాఫీసుకు అప్పగించిన విషయం తెలిసిందే. ఆధార్ అప్‌డేట్ కోసం వచ్చినవారు కూడా వేచిచూస్తూ ఉండాల్సి వచ్చింది. మధ్యాహ్నం 12.20 గంటలకు కరెంటు సరఫరా వచ్చేవరకు ఎదురుచూస్తూ ఉండిపోయారు. భారీ మొత్తంలో లావాదేవీలు జరిగే ప్రధాన పోస్టల్ కార్యాలయంలో ఇలా జరగటం జనాన్ని విస్మయపరుస్తోంది.

వృద్ధుల హక్కులపై అవగాహన అవసరం

- ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.వివేక్ వర్ధన్
- పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో న్యాయవిజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న న్యాయమూర్తి వివేక్‌వర్ధన్

తెనాలిరూరల్: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో ముఖ్య అతిథిగా ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.వివేక్ వర్ధన్ పాల్గొని వృద్ధులకు ఉన్న హక్కులను, చట్టాలలో వారికి కల్పించిన వెసులుబాటును, చట్టబద్ధంగా వాటి ఉపయోగించే విధానం పై అవగాహన కల్పించారు. సమాజంలో వారు నిరాదరణకు గురి కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ మాట్లాడుతూ వృద్ధులు నిరాధరణకు గురవుతున్న అంశాలను వివరించారు. వారికి చేయూత అందించటమే ఈ న్యాయ విజ్ఞాన సదస్సు ఉద్దేశమని చెప్పారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ మాట్లాడుతూ సమాజంలో వృద్ధులు నిరాదరణకు గురవుతున్నారని, దానికి మానవీయ విలువలు లోపించడం ప్రధాన కారణమన్నారు. వాటిని పెంపొందించడం కోసం స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ సహాధ్యక్షుడు జి.సుబ్బారావు మాట్లాడుతూ వృద్ధులకు తమ అసోసియేషన్ అండగా ఉంటుందని తెలిపారు. స్వరలయ వేదిక అధ్యక్షుడు లక్కరాజు సాయి, న్యాయ సేవా అధికార సంస్థ సూపరింటెండెంట్ మహబూబ్, పెన్షనర్ల సంస్థ కార్యదర్శి సూర్యప్రకాశరావు, సోమయ్య శాస్త్రి పాల్గొన్నారు.

ప్రారంభమైన స్వామివార్ల పల్లకీ సేవ



తెనాలిటౌన్: శ్రవణానక్షత్రం సందర్భంగా శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వైకుంఠపురంలో శ్రీ స్వామి అమ్మవార్లకు పల్లకి సేవ కనులపండువగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వి.అనుపమ మాట్లాడుతూ ప్రతి నెల శ్రవణానక్షత్రం రోజున సాయంత్రం 6 గంటలకు స్వామి, అమ్మవార్లకు పల్లకీ సేవ జరుగుతుందని తెలిపారు. అర్చకులు హారతి ఇచ్చి పల్లకీ సేవను ప్రారంభించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

కట్నం వేధింపులపై కేసు

తెనాలిరూరల్: పుట్టింటి నుంచి అధిక కట్నం తీసుకురావాలని వేధిస్తున్న భర్తపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. పట్టణ సుల్తానాబాద్‌కు చెందిన దీపిక పుట్టింటి నుంచి అధిక కట్నం తెమ్మంటూ తనను భర్త వేధిస్తున్నాడని పోలీసులను ఆశ్రయించింది. ఆదివారం త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పేద విద్యార్థికి ఆర్థికసాయం



తెనాలిటౌన్: వాకర్స్ క్లబ్ తెనాలి–2 ఇరవై సంవత్సరాలు పూర్తి చేసుకున్నట్లు క్లబ్ అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ళ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం వాకర్స్ క్లబ్ తెనాలి–2లో నిర్వహించిన సేవా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవితాన్ని నడక ఎంతో అవసరమన్నారు. క్లబ్ 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అహ్మదాబాద్ విమాన దుర్ఘటన మృతులకు నివాళులర్పించారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు టి.రాజారావు కుటుంబ సభ్యులు పేద విద్యార్థికి రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. జి.వి జయసాగర్, డాక్టర్ పి.దీప్తి, జి.మురహరిరావు, భుజంగరావు, సత్యనారాయణరాజు, దేవబత్తుని ఉమామహేశ్వరరావు, తుమ్మల సత్యనారాయణ, విజయ, అనురాధ, జ్యోతి, శ్రీలత, ఝాన్సీలక్ష్మి, జి.ఎల్.ప్రసన్నకుమారి, తదితరులు ఉన్నారు.

రూ.1.43కోట్లతో కాల్వల మరమ్మతులు



డ్రెయిన్ల మరమ్మతులు పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

తెనాలిటౌన్: తెనాలి నియోజకవర్గంలో పంట కాల్వలు, డ్రెయిన్ల మరమ్మతుల కోసం రూ.1.43కోట్ల నిధులు కేటాయించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయిస్తున్నట్లు రాష్ట్ర ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఆదివారం రూరల్ మండలం కోపల్లె, గుడివాడ, అంగలకుదురు గ్రామాల్లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. రైతులకు ఉపయోగపడేలా పంట కాల్వల మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నీటి సంఘాల అధ్యక్షులు సమన్వయంతో పనిచేసి కాల్వలు ఆధునికీకరణకు సహకరించాలని సూచించారు. అంగలకుదురు వద్ద డ్రెయిన్‌లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గత మూడు రోజులుగా పొక్లెయిన్‌తో వ్యర్థాలు తొలగిస్తున్నా.. ఇప్పటికీ కాల్వ శుభ్రం కాలేదన్నారు. మున్సిపల్, పంచాయతీ సిబ్బంది ప్రతి ఇంటికి వచ్చి తడి చెత్త, పొడి చెత్త సేకరిస్తున్న నిర్లక్ష్యం కాల్వల్లో వ్యర్థాలు వేయడాన్ని తప్పుబట్టారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి వ్యర్థాలను కాల్వల్లో వేయవద్దని సూచించారు. ఆయన వెంట డ్రైనేజీ ఏఈ పెసర్లంక సత్యనారాయణ, అంగలకుదురు ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, పలువురు నీటి సంఘాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ల మార్పిడిని అడ్డుకోవాలి

తెనాలిటౌన్: విద్యుత్ మీటర్ల మార్పిడిని అడ్డుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కె.బాబుప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో రాడ్ బెండింగ్ కార్మికుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి కె.బాబుప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టక ప్రజలపై పన్నుల భారంతో పాటు విద్యుత్ ఛార్జీలు భారం మోపిందని ఆరోపించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. అవసరం లేకున్నా ఇళ్లకు వచ్చి మరీ మీటర్లు బిగిస్తున్నారని మండిపడ్డారు. యూనియన్ నాయకులు కె.వెంకటేశ్వర్లు, ఎస్.యోసేబు, కె.రవికుమార్, షేక్ హుస్సేన్‌వలీ, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోకేర్ సెంటర్ ప్రారంభం



ప్రారంభిస్తున్న మంత్రి మనోహర్

తెనాలిటౌన్: అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన ఫిజియోథెరఫీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. స్థానిక గంగానమ్మపేటలో డాక్టర్ రవికాంత్, డాక్టర్ సందీప్, డాక్టర్ చిత్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యాక్టివ్ లైఫ్ ఫిజియోకేర్ అండ్ ఇన్ పేషంట్ రిహాబిటేషన్ వైద్యశాలను మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. తెనాలి వంటి ప్రాంతంలో అత్యాధునిక సేవలతో ఫిజియోథెరఫీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని వైద్యులను అభినందించారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం



దుగ్గిరాల పసుపు యార్డు సమీపంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో ఆదివారం వేంకటేశుని కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. శ్రవణా నక్షత్రం సందర్భంగా ఉదయం 9 గంటలకు కనులపండువుగా స్వామి కల్యాణాన్ని నిర్వహించారు. శరత్చంద్ర చౌదరి, సుజాత దంపతులు కల్యాణ క్రతువులో పాల్గొన్నారు. ఉభయ దేవేరులతో పీటలపై కూర్చున్న గోవిందుడిని అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులు దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణను నిర్వాహకులు ఏర్పాటుచేశారు. కార్యక్రమ ఏర్పాట్లను ఉత్సవ కమిటీ పర్యవేక్షించింది.

– దుగ్గిరాల

క్రికెట్ విజేతలకు బహుమతులు ప్రదానం



బహుమతి ప్రదానం చేస్తున్న సాల్వేషన్ ఆర్మీ సంఘ పెద్దలు

తెనాలిటౌన్: యువత క్రీడల్లో ఉన్నతంగా రాణించాలని సాల్వేషన్ ఆర్మీ చర్చి సంఘ పెద్దలు గాలి రవికుమార్ సూచించారు. స్థానిక ఐతానగర్‌లోని ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్‌లో మే 1వ తేదీ నుంచి జూన్ 15 వరకు నిర్వహించిన టీపీఎల్–2025 క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. మొదటి బహుమతి విజయ్ సీసీ టీమ్ రూ.30వేలు, ద్వితీయ బహుమతి జగన్ 2.0 రూ.15వేలు, తృతీయ బహుమతి అనిల్ సీసీ రూ.10వేలు కైవసం చేసుకున్నాయి. విజేతలకు గాలి రవికుమార్, శోభన్, కె.రవికిరణ్ చేతుల మీదుగా నగదు, మెమెంటో అందజేశారు. తెనాలి ప్రాంతంలో క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేసి యువతను ప్రోత్సహించడం అభినందనీయమని కొనియాడారు. టోర్నమెంట్ నిర్వాహకులు కనపర్తి జవహర్‌కుమార్, గెడ్డేటి బాలయ్య, తదితరులు ఉన్నారు.

మార్పు రాకపోతే పీడీ యాక్ట్ నమోదు

మంగళగిరి టౌన్: రౌడీ షీటర్లు తమ ప్రవర్తన మార్చుకోకున్నా.. చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్నా పీడీ యాక్ట్ నమోదు చేస్తామని మంగళగిరి పట్టణ సీఐ వీరాస్వామి హెచ్చరించారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సీఐ మంగళగిరిలోని రౌడీ షీటర్ల నేరచరిత్ర, వారిపై ఉన్న కేసులు, ప్రస్తుత జీవన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రౌడీ షీటర్‌పై ప్రత్యేక నిఘా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ హరిబాబు, క్రైమ్ సిబ్బంది ఏడుకొండలు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి: రౌడీ షీటర్లు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని రూరల్ ఎస్ఐ ఎస్ వెంకట్ తెలిపారు. ఆదివారం మంగళగిరి రూరల్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆయన స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు తమ పద్ధతులు మార్చుకుని ప్రశాంత జీవనంలో గడపాలన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదన్నారు.

పివా అధ్యక్షులుగా లక్ష్మీ పెరుమాళ్లు



లక్ష్మీ పెరుమాళ్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్న అసోసియేషన్ సభ్యులు

మంగళగిరి టౌన్: పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్(పివా) మంగళగిరి బ్రాంచ్ అధ్యక్షులుగా తాటిపాముల లక్ష్మీ పెరుమాళ్లు నియమితులయ్యారు. మంగళగిరి నగర పరిధి షరాఫ్ బజార్‌లోని డాంగే కాంప్లెక్స్ పివా మంగళగిరి బ్రాంచ్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో సభ్యులు లక్ష్మీ పెరుమాళ్లను మంగళగిరి బ్రాంచ్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఆమోదించారు. 13 ఏళ్ల పాటు అసోసియేషన్‌కు సహకరించిన డాంగేను సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా లక్ష్మీ పెరుమాళ్లు మాట్లాడుతూ.. పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. సమావేశంలో మంగళగిరి బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, పివా కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి విన్నకోట వెంకటేశ్వర్లు, కోశాధికారి కనకదుర్గా ప్రసాద్, సహాయ కార్యదర్శి మురుగుడు లక్ష్మీ నారాయణ, కేంద్ర కమిటీ సభ్యులు అందె వెంకన్న, మంగళగిరి బ్రాంచ్ కోశాధికారి బట్టు నారాయణ, సహాయ కార్యదర్శి గోలి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

జూద స్థావరాలపై పోలీసులు దాడి

తాడికొండ: తుళ్లూరు మండలం నెక్కల్లు గ్రామంలో జరుగుతున్న కోడి పందేల స్థావరాలపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 5 మంది వ్యక్తులతో పాటు ఒక కోడి, రూ.15,780 నగదును స్వాధీనం చేసుకున్నారు. పందెం రాయుళ్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు.

అంజన్నకు లక్ష నాగవల్లీ దళార్చన నేడు

ఫిరంగిపురం: మండలంలోని 113.తాళ్లూరు గ్రామంలోని శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం లక్ష నాగవల్లీ దళాలతో విశేష అర్చనలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు దీవి ప్రసన్నమూర్తి ఆదివారం తెలిపారు. ఉదయం 9 గంటలకు పూజలు ప్రారంభం అవుతాయని అన్నారు. 23 మంది రుత్వికులు పూజల్లో పాల్గొంటారని.. వైఖానస ఆగమ ప్రవర దీవి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తారని చెప్పారు.

విశ్వాసులకు భోజనం పంపిణీ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపై ఉన్న కార్మెల్‌మాతను దర్శించుకునేందుకు ఆదివారం విశ్వాసులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వారికి భోజనం అందించేందుకు వీలుగా రాజాపేట, కొండమెట్లబజారుకు చెందిన వారు ముందుకు వచ్చారు. కొండను ఎక్కి కార్మెల్‌మాతను దర్శించుకున్న తరువాత వచ్చిన భక్తులకు భోజనం, తాగునీరు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతివారం విశ్వాసులు ఎంత మంది వచ్చినా వారికి భోజనం, తాగునీరు అందించనున్నట్లు తెలిపారు.